## మార్చి 16 నుంచి ఖాజాపీర్ మస్తాన్ వలి ఉరుసు

**వాల్మీకిపురం:** స్థానిక హజరత్ ఖాజాపీర్ మస్తాన్ వలి దర్గా ఉరుసు ఉత్సవాలను మార్చి 16 నుంచి 18వ తేది వరకు నిర్వహించనున్నట్లు దర్గా కమిటీ అధ్యక్షుడు సందాని తెలిపారు. సోమవారం స్థానిక దర్గాలో ముస్లిం మతపెద్దలతో కలసి పోస్టర్లను ఆవిష్కరించారు. 16న హజరత్ ఖ్వాజా సయ్యద్‌షా అరిఫుల్లా మొహమ్మద్ హుసేని చిష్తివుల్ ఖాదరి సజ్జాద నషీన్ ఆస్థాన–ఎ–మఖ్దూముల్లాహి సమక్షంలో గంధోత్సవం, చాదర్ పోషి, 17న ఉరుసు , ఖవ్వాలీ, 18న తహలీల్ ఫాతెహా నిర్వహించనున్నట్లు తెలిపారు. అలాగే అన్నదాన కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని, హిందూ, ముస్లిం, క్రైస్తవ సోదరులు పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో అజీమ్, అమీర్ హుస్సేన్, జవాద్‌హుస్సేన్, జాకీర్, జబ్బార్ సాహెబ్, కరీం, చాను, తాహీర్, సద్దార్, రషీద్ పాల్గొన్నారు.







## వైభవంగా బ్రహ్మోత్సవాల అంకురార్పణ

**గుర్రంకొండ:** మండలంలోని తరిగొండ గ్రామంలో వెలసిన శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి బ్రహ్మోత్సవాల అంకురార్పణ వైభవంగా నిర్వహించారు. స్వామి వారి బ్రహ్మోత్సవాలు ప్రారంభం అయ్యాయి. సోమవారం ఆలయంలో వేకువజామునే మూలవర్లకు అభిషేకం, తోమాలసేవ నిర్వహించారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా ఆలయంలో కలశస్థాపన చేశారు. వేదపండితుల మంత్రోచ్ఛారణల నడుమ స్వస్తివాచనం, పుణ్యావాచానం కావించారు. అనంతరం రక్షాబంధనం,మృత్యంగ్రహణం, అంకురార్పణ వైభవంగా నిర్వహించారు. ఈసందర్భంగా స్వామివారికి ఘనంగా పూజలు చేశారు. స్వామివారి ఉత్సవాల కార్యక్రమాలన్నీ వైభవంగా నిర్వహించారు. కార్యక్రమంలో టీటీడీ అధికారులు, అర్చకులు పాల్గొన్నారు.


ప్రత్యేక అలంకారంలో స్వామివార్లు

## ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు వినియోగంపై అవగాహన

**మదనపల్లె :** త్వరలో జరగనున్న ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి ఓటు నమోదుపై ఓటర్లు చేయాల్సినవి, చేయకూడనివి తెలుపుతూ ఎన్నికల సంఘం నమూనా పోస్టర్ విడుదల చేసిందని తహసీల్దార్ సీకే.శ్రీనివాసులు తెలిపారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ఎన్నికల సంఘం ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు వినియోగంపై ఓటర్లకు అవగాహన కల్పించేందుకు విడుదల చేసిన మోడల్ పోస్టర్‌ను అన్ని పోలింగ్ కేంద్రాల వద్ద ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటరుకు ఇచ్చే బ్యాలెట్ పేపర్ మీద అభ్యర్థుల పేర్లు, ఫోటోలు ఉంటాయన్నారు. దీనిపై పోలింగ్ కేంద్రాల్లో ఇచ్చే పెన్‌తో మాత్రమే మొదట ప్రాధాన్యత ఇవ్వాలనుకున్న వారికి 1వ నెంబర్, మిగిలిన వారికి తమకు నచ్చిన విధంగా 2,3,4 ప్రాధాన్యత నమోదు చేయాలన్నారు.

### జగనన్న కాలనీకి నీటి సౌకర్యం

**కలకడ :** జగనన్న కాలనీలలో ఇంటి నిర్మాణాలు వేగవంతం చేయడానికి నీటి సౌకర్యం కల్పించినట్లు ఎంపీపీ శ్రీదేవి తెలిపారు. సోమవారం మండలంలోని, కలకడ, కె.బాటవారిపల్లె పంచాయతీలలో జరుగుతున్న జగనన్న కాలనీలో ఇంటి నిర్మాణాలను హౌసింగ్ అధికారులతో కలిసి ఆమె పరిశీలించారు. గతంలో నిర్మాణాలకు నీరు లేకపోవడంతో నత్తనడకన సాగుతున్నట్లు లబ్ధిదారులు తెలియజేయడంతో ప్రత్యేక పైప్‌లైన్ ఏర్పాటు చేసి నీరు అందించినట్లు తెలిపారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆశయం మేరకు త్వరిత గతిన ఇంటి నిర్మాణాలు పూర్తి చేసి ఎన్నికలకు మందే గృహ ప్రవేశాలు చేసేవిధంగా చూడాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఏఈ రమణయ్య, వర్క్ ఇన్‌స్పెక్టర్ నాగమణినాయక్, ఇంజనీరింగ్ అసిస్టెంట్ చరిష్మాంజలి, తదితరులు పాల్గొన్నారు.

### ఘనంగా శ్రీచౌడేశ్వరిదేవి ఉత్సవాలు

**కలకడ :** శ్రీ చౌడేశ్వరిదేవి పవిత్ర జ్యోతులు ఇంటింటి పూజలు అందుకున్నాయి. మండలంలోని కదిరాయచెర్వు గ్రామంలో గ్రామ దేవత శ్రీచౌడేశ్వరిదేవి ఉత్సవాలను తొగటవీరక్షత్రియుల ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. పవిత్ర జ్యోతుల ముందు, మేలతాళాలు, సన్నాయి నాదం, చక్క భజనలు, కోలాటం వంటి కళాకారుల నృత్యాలు భక్తులను ఆకట్టుకున్నాయి. ఆలయ ప్రవేశం అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు.

### ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి

**తంబళ్లపల్లె:** మండలంలో ప్రజా సమస్యల పరిష్కారానికి వీఆర్వోలు కృషి చేయాలని తహసీల్దార్ కళావతి ఆదేశించారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో వీఆర్వోలతో సమావేశం నిర్వహించారు. ప్రజల సమస్యలు గుర్తించిన వెంటనే పరిష్కరించేందుకు చొరవ చూపాలన్నారు. ప్రజలకు అందుబాటులో ఉంటేనే సమస్యలు గుర్తించే అవకాశం ఉంటుందన్నారు. రేషన్‌కార్డు దారులకు సకాలంలో సరుకులు పంపిణీ చేసేందుకు చొరవ చూపాలన్నారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యం చేసినా, ప్రజల నుంచి విమర్శలు, ఫిర్యాదులు వచ్చినా చర్యలు తప్పవన్నారు.

### తాగునీటి సమస్యపై ప్రత్యేక దృష్టి సారించాలి

**కలికిరి:** మండలంలో తాగునీటి సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించాలని ఎంపీడీఓ గంగయ్య అన్నారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ నూర్జహాన్ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ ఎన్నికల నియమావళి అమలులో ఉన్నందున అత్యవసరాలపై మాత్రమే ప్రజాప్రతినిధులు చర్చించాలని కోరారు. వేసవికాలం ప్రారంభమవుతున్న నేపథ్యంలో గ్రామాల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా ప్రజాప్రతినిధులతో కలిసి అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. గుట్టపాళెం, అద్దవారిపల్లి గ్రామ పంచాయతీల్లో తాగునీటి పైపులైన్‌లు అవసరమైనట్లు సర్పంచ్‌లు ఆర్.వెంకటరెడ్డి, గంగయ్యలు సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. కార్యక్రమంలో తహసీల్దారు భాగ్యలత, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

### మహిళా దినోత్సవాన్ని జయప్రదం చేయండి

**పీలేరు :** మహిళా దినోత్సవాన్ని జయప్రదం చేయాలని షీ సంస్థ అధ్యక్షురాలు పి.వి.ఎస్. లక్ష్మీ, కోఆర్డినేటర్ కవిత, నటరాజ నాట్యకళామండలి అధ్యక్షురాలు హరిత కోరారు. సోమవారం వారు స్థానిక విలేకరులతో మాట్లాడుతూ మార్చి 8న అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని మార్చి 6న మహిళలకు యోగా, నృత్య, ఆటల పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. పోటీలో పాల్గొనదలచిన మహిళలు 7780252713, 9948244442 నంబర్లను సంప్రదించాలని కోరారు.

## ప్రజాసమస్యల పరిష్కారానికి 'స్పందన'

**మదనపల్లె :** ప్రజాసమస్యల పరిష్కారానికి ప్రతి సోమవారం అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో నిర్వహించే స్పందన కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆర్డీఓ ఎం.ఎస్.మురళి అన్నారు. సోమవారం ఉదయం సబ్ కలెక్టరేట్‌లో జరిగిన స్పందనలో ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. వారి సమస్యలను తెలుసుకుని కొన్ని అర్జీలకు సంబంధించి సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడి అక్కడికక్కడే పరిష్కరించేందుకు ప్రయతి్నంచారు. మిగిలిన వాటిని ఆయా అధికారులకు పంపించి పరిష్కారానికి తీసుకున్న చర్యలపై నివేదిక రెవెన్యూ డివిజనల్ కార్యాలయానికి పంపాల్సిందిగా ఆదేశించారు. స్పందన కార్యక్రమంలో పలువురు భూసమస్యలు, పాసు పుస్తకాలు, సర్వే, డీకేటీ భూముల ఆక్రమణ, పరిహారం తదితర సమస్యలకు సంబంధించి ఫిర్యాదులు వచ్చాయి. మున్సిపాలిటీలో జరిగిన స్పందన కార్యక్రమంలో కమిషనర్ కే.ప్రమీల ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. వెన్నెల మహిళా గ్రూపుకు సంబంధించి సభ్యురాలు సిద్ధమల్లమ్మ మరణించారని, ఆమెకు రావాల్సిన పైకం ఇప్పించాల్సిందిగా కుటుంబసభ్యులు అర్జీ సమర్పించారు. సప్తగిరి నగర్‌లో రోడ్లు, కాలువలు, వీధి దీపాలు ఏర్పాటుచేయాలని, అనపగుట్టలో దారి సమస్యపై ఫిర్యాదులు అందాయి. వీటిని పరిష్కరించాలని కమిషనర్ అధికారులను ఆదేశించారు.


ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న ఆర్డీఓ మురళి

### శ్యాంప్రసాద్‌రెడ్డిని గెలిపించండి

**ములకలచెరువు:** తూర్పు రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీగా పోటీ చేస్తున్న పెర్నాటి శ్యాంప్రసాద్‌రెడ్డిని గెలిపించాలని ములకలచెరువు మండలంలో సోమవారం వైఎస్సార్‌సీపీ ప్రజాప్రతినిధులు, నాయకులు ప్రచారం నిర్వహించారు. బురకాయలకోట, సెంట్రల్ స్కూల్, వేపూరికోట, పర్తికోట, దేవులచెరువు, కాలువపల్లి, గూడిపల్లె పంచాయతీల్లో ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్బీకే చైర్మన్ వెంకటేశ్వర్‌రెడ్డి, జేసీఎస్ చైర్మన్ రవీంద్రారెడ్డి, నరేష్‌రెడ్డి, సర్పంచులు వై. విజయమ్మ, వెంకటరమణారెడ్డి, ప్రభావతమ్మ, మనోహరమ్మ, మహబూబ్‌బాషా పాల్గొన్నారు.


ప్రచారం చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

### పైపులైన్లు దెబ్బతినకుండా పనులు చేపట్టాలి

**పీలేరు :** స్థానిక చిత్తూరు రోడ్డు మార్గంలో ఆర్‌ఓబీ నిర్మాణ పనుల్లో గ్రామ పంచాయతీకి చెందిన తాగునీటి పైపులైన్లు దెబ్బతినకుండా చూడాలని సర్పంచ్ డాక్టర్ హబీబ్‌బాషా అన్నారు. సోమవారం చిత్తూరు రోడ్డు మార్గంలో ఎన్‌హెచ్ డీఈ నాగరాజుతో కలసి ఆర్‌ఓబీ పనులు జరిగే ప్రాంతాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ పట్టణానికి తాగునీరు సరఫరా చేసే ప్రధాన పైపులు ఉన్నందున, పనులు చేసే సమయంలో దెబ్బతినకుండా చూడాలని కోరారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ నాగరాజనాయక్ , ఈఓ రెడ్డిప్రసాద్‌రెడ్డి, నాయకులు సాంబశివరెడ్డి, కాలనీ చిన్న, రమణారెడ్డి పాల్గొన్నారు.




